


దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 02 సంచిక : 72 గురువారం 13-03-2025 ఎడిటర్ : వేముల అయోధ్య రాములు పేజీలు : 4 వెల : 5 రూ/..

# అభివృద్ధి, ప్రగతివైపు తెలంగాణ అడుగులు

**రైతుల అభివృద్ధికి అనేక రకాల చర్యలు**

**రుణమాఫీ, రైతుభరోసా వంటి పథకాల అమలు**

**రికార్డుస్థాయిలో 260 లక్షల మెట్రిక్ టన్నుల వరి ఉత్పత్తి**


**తెలంగాణ అభివృద్ధిలో రైతుల భాగస్వామ్యం ఉంది**

**గేమ్‌ఛేంజర్‌గా మహాలక్ష్మి పథకం నిలిచింది**

**యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు**

**తెలంగాణ అసెంబ్లీలో గవర్నర్ జిష్టుదేవ్ వర్మ ప్రసంగం**

**సభకు హాజరైన విపక్షనేత కెసిఆర్**



**హైదరాబాద్,మార్చి12:** అభివృద్ధి, ప్రగతివైపు తెలంగాణ అడుగులు వేస్తోందని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ప్రశంసించారు. మా ప్రభుత్వం సామాజిక న్యాయం సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు. తెలంగాణకు రైతులే ఆత్మ అని, వారి అభివృద్ధికి కృషి చేస్తున్నామని, ప్రజల కోసం నిరంతరం శ్రమించే వాళ్లే అన్నదాతలు అని జిష్ణుదేవ్ వర్మ కొనియాడారు. 260 లక్షల మెట్రిక్ టన్నుల వరి ఉత్పతి చేసి దేశంలోనే తెలంగాణ రికార్డు సృష్టించిందని ప్రశంసించారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు బుధవారం ఉదయం గవర్నర్ ప్రసంగంతో ప్రారంభమయ్యాయి. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ప్రసంగించారు. తెలంగాణ భౌగోళిక ప్రాంతమే కాదని, ఒక భావోద్వేగ ప్రాంతమని, స్థిరత్వం, దృఢ సంకల్పానికి గుర్తు తెలంగాణ అని అన్నారు. తెలంగాణ అభివృద్ధిలో రైతుల భాగస్వామ్యం ఉందని, రైతులకు మద్దతివ్వడం వారిని శక్తిమంతులుగా తీర్చిదిద్దడమే తమ బాధ్యత అని, దేశంలోనే అత్యధికంగా ధాన్యం పండిస్తున్న రాష్ట్రం తెలంగాణ అని తెలియజేశారు. రైతులకు రుణమాఫీ చేశామని, ఇదే రైతుల పట్ల తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. 25.35 లక్షల మంది రైతులకు ప్రయోజనం కల్పించామని, ఎకరానికి రూ.12 వేల చొప్పున రైతులకు అందిస్తున్నామని, రైతు నేస్తం అమలు చేస్తున్నామని, వరికి రూ.500 చొప్పున బోనస్ ఇస్తున్నామని, రైతుల కోసం వ్యవసాయ కమిషన్ ఏర్పాటు చేశామన్నారు. గేమ్‌ఛేంజర్‌గా మహాలక్ష్మి పథకం నిలిచిందని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణి కల్పిస్తున్నామని జిష్ణుదేవ్ వర్మ వివరించారు. ఘనమైన సంస్కృతి నిలయం తెలంగాణ అని అన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రైతుల అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రజల కోసం గద్దర్, అంజయ్య వంటి ఎందరో కృషి చేశారన్నారు. జననీ జయకేతనం రాష్ట్ర గీతంగా చేసుకున్నామని తెలిపారు. సామాజిక న్యాయం, అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరించుకున్నామన్నారు. తెలంగాణ ప్రజల కలల సాకారానికే ఈ బడ్జెట్ అని అన్నారు. ప్రజలే కేంద్రంగా పాలన కొనసాగుతోందని గవర్నర్ వెల్లడించారు. ల్గ÷తులకు మద్దతివ్వడం, వారిని శక్తిమంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. దేశంలోనే ధాన్యం పండిస్తున్న రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. రైతులకు రుణమాఫీ చేశామని.. ఇదే రైతుల పట్ల చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. 23.35 లక్షల మంది రైతులకు ప్రయోజనం కల్పించామని తెలిపారు. ప్రజలే కేంద్రంగా పాలన సాగుతోందని, రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రైతులు, మహిళలు, యువతకు అన్ని విధాలా సహకారం అందిస్తామని చెప్పారు. రైతుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ఘనమైన సంస్కృతికి నిలయం తెలంగాణ అని పేర్కొన్నారు. తెలంగాణ పురోగమించడమే కాదు.. రూపాంతరం చెందుతోందన్నారు. సమ్మిళిత, స్వయం సమృద్ధి, సాధికార తెలంగాణ విజన్‌తో పని చేస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి, సమృద్ధికి దిక్సూచిగా ఉండేలా తెలంగాణ నమూనా ఉండాలని, తెలంగాణ భౌగోళిక పాత్రమే కాదు.. ఒక భావోద్వేగమన్నారు. తెలంగాణ స్థిరత్వం, దృఢసంకల్పానికి గుర్తు అన్నారు.రైతుల స్వేదం, కష్టం మన ప్రజలను పోషిస్తోందన్నారు. 260లక్షల మెట్రిక్ టన్నుల వరి ఉత్పత్తితో దేశంలోనే తెలంగాణ రికార్డు సృష్టించిందని తెలిపారు. ఇది మన రైతుల స్థిరత్వం, అంకిత భావానికి ఓ సాక్ష్యమన్నారు. రూ.2లక్షల పంట రుణమాఫీని అమలు చేస్తున్నట్లు గవర్నర్ పేర్కొన్నారు. ఇది ప్రభుత్వం చేసిన వాగ్దానాల నిర్దిష్ట కాల అమలుకు సాక్ష్యమన్నారు. రైతు భరోసా కింద నేరుగా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు ద్వారా యువతకు సాధికారత లభిస్తోంది. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా అగ్రశ్రేణి శిక్షణ అందుతోంది. సివిల్ సర్వీసు పరీక్షల ఆశావహుల కోసం రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం పథకం తెచ్చాం. గతేడాది 55 వేల మందిగా పైగా యువత పభుత్వోద్యోగాలు పొందారు. ఆరోగ్యశ్రీ పథకం కవరేజీ రూ.10 లక్షల వరకు పెంచాం. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు బిల్లు ప్రతిపాదించాం. ఎస్సీ ఉపవర్గీకరణ కోసం బిల్లును ప్రవేశపెట్టనున్నామని గవర్నర్ అన్నారు. గవర్నర్ ప్రసంగం అనంతరం శాసనసభ గురువారానికి వాయిదా పడింది. సమావేశాలకు ప్రతిపక్ష నేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు హాజరయ్యారు. గవర్నర్ ప్రసంగిస్తున్న సమయంలో విపక్ష సభ్యులు నిరసనలు వ్యక్తం చేశారు.



# బంగ్లా నుంచి అక్రమ చొరబాట్లు

**2601 మంది బంగ్లాదేశీయుల అరెస్ట్**

**కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్**

**న్యూఢిల్లీ,మార్చి12:**

భారత్‌లోకి బంగ్లాదేశ్ అక్రమ చొరబాటుదారులను అడ్డుకోవడానికి కేంద్ర ప్రభుత్వం వేగవంతంగా చర్యలు తీసుకుంటుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ పేర్కొన్నారు. బంగ్లాదేశ్ సరిహద్దులో భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించిన 2601 మంది బంగ్లాదేశీయులను భారత బలగాలు అరెస్టు చేసినట్లు 2024 జనవరి నుంచి ఈ ఏడాది జనవరి మధ్య కాలంలో వీరిని అదుపులోకి తీసుకున్నామన్నారు. రాజ్యసభలో ఈమేరకు ఆయన లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. భారత్-బంగ్లా సరిహద్దు ప్రాంతంలో భద్రతను బలోపేతం చేయడానికి అధునాతన నిఘా, సాంకేతిక వ్యవస్థ, సమగ్ర ఇంటిగ్రేటెడ్ బోర్డర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ వంటివి వినియోగిస్తున్నట్లు తెలిపారు. అంతే కాకుండా నిరంతర పెట్రోలింగ్, చొరబాటుకు అవకాశం ఉన్న ప్రదేశాల్లో ఫ్లడ్‌లైట్లు, సోలార్ లైట్లు ఏర్పాటు, నదీ ప్రాంతాల్లో నిరంతరం పడవలతో పహారా చేపడుతున్నామన్నారు. బీఎస్‌ఎఫ్ నేతృత్వంలోని 15 మానవ అక్రమ రవాణా నిరోధక విభాగాలు భద్రతా ప్రమాణాలను మరింత బలోపేతం చేస్తున్నాయని వెల్లడించారు. గతేడాది ఆగస్టు 5న హసీనా ప్రభుత్వం పతనమైన అనంతరం తాజాగా ఇరు దేశాల భద్రతా బలగాల అడిషనల్ డైరెక్టర్ జనరల్ స్థాయి అధికారుల మధ్య చర్చలు జరిగాయని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా భారత్-బంగ్లా మధ్యనున్న 4,096 కిలోమీటర్ల పొడవైన సరిహద్దులో కంచె లేని ప్రాంతాల్లో కంచె వేయడానికి అంగీకారం కుదిరిందని పేర్కొన్నారు.

# త్రిభాషా సూత్రం ముమ్మాటికీ సమ్మతమే

**ఎన్ని భాషలు నేర్చుకుంటే అంత మంచిది**

**ఎంపి సుధామూర్తి స్పష్టీకరణ**

**న్యూఢిల్లీ,మార్చి12:** జాతీయ విద్యా విధానం లో భాగమైన త్రిభాషా సూత్రం అమలుపై తమిళనాడు-కేంద్ర ప్రభుత్వాల మధ్య తీవ్ర వివాదం కొనసాగుతున్న తరుణంలో రాజ్యసభ ఎంపి సుధామూర్తి ఎన్ఇపికి మద్దతు పలికారు. భాషలు నేర్చుకోవడంలో తప్పులేదన్నారు. ప్రస్తుత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లోనూ దీనిపై ఎంపీల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఈ నేపథ్యంలో రాజ్యసభ ఎంపీ, ప్రముఖ వితరణశీలి సుధామూర్తి దీనిపై మాట్లాడుతూ.. త్రిభాషా సూత్రానికి మద్దతు పలికారు. ఎక్కువ భాషలు నేర్చుకోవడం పిల్లలకే మంచిదన్నారు. 'ఒక వ్యక్తి అనేక భాషలు నేర్చుకోవాలని సూచిస్తాను. నాకు 7-8 భాషలు వచ్చు. నేర్చుకోవడాన్ని నేను చాలా ఇష్టపడతా. పిల్లలు కూడా దీని వల్ల మంచి ప్రయోజనాలు పొందుతారు' అని సుధామూర్తి అభిప్రాయం వ్యక్తం చేశారు. హిందీ వివాదం వేళ ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. త్రిభాషా సూత్రం అమలుపై ప్రతిపక్షాలు, ముఖ్యంగా డీఎంకే పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోన్న సంగతి తెలిసిందే. ఇటీవల కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం దీనిపై మాట్లాడుతూ.. 'ద్విభాషా పద్ధతిపై తమిళనాడు చాలా స్పష్టంగా ఉంది. ప్రపంచ శాస్త్ర, సాంకేతికత, వాణిజ్య విధానాలతో అనుసంధానం కోసం ఆంగ్లం నేర్చుకోవాలి. రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకోవడం కోసం తమిళం ఉండాలి. ఒకవేళ మూడో భాషను నేర్చుకోవాలంటే అది విద్యార్థుల అభీష్టానికి వదిలేయాలి. అంతేగానీ.. తప్పనిసరి అంటూ బలవంతంగా రుద్దకూడదు. కేంద్రం చర్యలను మేం తీవ్రంగా ఖండిస్తున్నాం' అని అన్నారు. అయితే, ప్రతిపక్షాల ఆరోపణలను కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తిప్పికొట్టారు. విద్యార్థులు చదువుకునే హక్కును హరించేందుకు విపక్షాలు ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు. విద్యా విధానాల అమలు విషయంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని హితవు పలికారు.

# గవర్నర్ ప్రసంగంలో పస లేదు

**బిజెపి పక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి**

**హైదరాబాద్,మార్చి12:** గవర్నర్ ప్రసంగం విజనరీ డాక్యుమెంట్‌గా ఉంటుందని ఆశించామని.. ప్రసంగమంతా పూర్తి డొల్ల అని అసెంబ్లీలో బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. గవర్నర్ ప్రసంగంలో వాస్తవాలు లేవని, ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత ఎందుకు కల్పించలేదని ప్రశ్నించారు. చేయని పనులు చేసినట్లుగా గవర్నర్ ప్రసంగం ఉందన్నారు. రైతు రుణమాఫీ పూర్తిగా జరిగిందనేది అవాస్తవం అన్నారు. ఏవీ ఇవ్వకున్నా.. అన్ని ఇస్తున్నట్లు గవర్నర్ ప్రసంగంలో పేర్కొన్నారన్నారు. మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ.2,500 విద్యార్థినులకు స్కూటీలు ఇచ్చారా? అని నిలదీశారు. అబద్దాల పునాదుల మీద ప్రసంగం ఉందని.. నిరుద్యోగ సాధికారిత అని మోసపూరిత మాటలు గవర్నర్ ప్రసంగంలో పొందుపరిచారని విమర్శించారు.

# అసెంబ్లీ సమావేశాలకు విధిగా హాజరు కావాలి

**ప్రతి విషయంలోనూ అవగాహనతో ఉండాలి**

**విపక్షాల విమర్శలను ధీటుగా ఎదుర్కోవాలి**

**సిఎల్‌పి భేటీ సిఎం రేవంత్ స్పష్టమైన ఆదేశాలు**

**హైదరాబాద్,మార్చి12:** అసెంబ్లీ సమావేశాలకు అందరు ఎమ్మెల్యేలు తప్పనిసరిగా హాజరు కావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ప్రతిపక్షాలు గందరగోళం చేసే ప్రయత్నం చేస్తాయని, సంయమనంతో వ్యవహరించాలని సీఎం సూచించారు. అసెంబ్లీ ప్రాంగణంలో జరిగిన సీఎల్పీ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని పలు సూచనలు చేశారు. సభలో వ్యవహరించాల్సిన విధానంపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. ప్రజా ప్రభుత్వంలో ఇవి రెండో పూర్తిస్థాయి బడ్జెట్ సమావేశాలని, అత్యంత కీలకమైనవిగా సీఎం స్పష్టం చేశారు. ఈ 15నెలల్లో ప్రజా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై పూర్తిగా చర్చించుకునేందుకు ఈ సమావేశాల్లో అవకాశం ఉందన్నారు. సభ్యులందరూ కచ్చితంగా రావాల్సిందేనని, ప్రతిపక్షాల విమర్శలను ధీటుగా ఎదుర్కోవాలన్నారు. సమావేశాల్లో సభ్యులంతా సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. అంశాల వారీగా ప్రిపేర్ అయి సభకు రావాలని తెలిపారు. సభ్యుల హాజరుపై ప్రభుత్వ విప్‌లు పర్యవేక్షించాలని సూచించారు. కొందరు ఎమ్మెల్యేలు అసెంబ్లీని నిర్లక్ష్యం చేస్తున్నారని ఈ సందర్భంగా సీఎం అసహనం వ్యక్తం చేశారు. హాజరైతేనే సభలో ఏం జరుగుతుందో తెలుస్తుందన్నారు. సీఎల్పీ భేటీలో మాట్లాడుతుండగా బయటకు వెళ్లిన నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జైవీర్‌పై సీఎం అసహనం వ్యక్తం చేశారు. కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. 'చాలామంది సీరియస్ గా పనిచేయట్లేదు. ఒకసారి గెలవడం గొప్పకాదు. మరోసారి అసెంబ్లీకి రావడమే గొప్ప. చాలా మంది బీఆర్ ఎస్ పట్ల సైలెంట్ గా ఉంటున్నారు. అలా చేస్తే మీ మీద అభ్యర్థిని పెట్టరు అనుకుంటున్నారా.. అలా అస్సలు ఊహించుకోకండి. వాళ్ల గురించి నాకు బాగా తెలుసు. రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత అన్నింటికీ ధైర్యంగా ముందుకెళ్లాలి' అంటూ చెప్పుకొచ్చారు సీఎం రేవంత్.మీటింగ్ మధ్యలో నాగార్జున సాగర్ ఎమ్మెల్యే జయవీర్ బయటకు వెళ్లడంపై సీఎం



రేవంత్ సీరియస్ అయ్యారు. 'ఓ వైపు నేను ఇంత సీరియస్ గా మాట్లాడుతుంటే అతనేంటి అలా వెళ్తున్నారు. ఇంత నాన్ సీరియస్ గా ఉంటే ఎలా.. మనం మరోసారి గెలవాలంటే చాలా సీరియస్ గా పనిచేయాల్సిందే. రాజకీయాలు అంటే పిల్లలాటలు కాదు. అందరం కలిసి పనిచేస్తేనే మరోసారి మన ప్రభుత్వం వస్తుంది. కొందరి వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు రావొద్దు. ఇక నుంచి అందరూ సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండాలి. వచ్చే నెల 6వ తేదీ నుంచి అన్ని జిల్లాల ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి లంచ్ మీటింగ్ పెట్టుకుందాం. అందరి పనితీరుపై చర్చిద్దాం' అంటూ సీరియస్ గా క్లాస్ తీసుకున్నారు.

# గాంధీభవన్‌లో ప్రెస్‌మీట్‌లా గవర్నర్ ప్రసంగం

**గవర్నర్ చేత అన్నీ అబద్దాలు చెప్పించాలి**

**పటుల ఎండుతున్నా ఎక్కడా ప్రస్తావన లేదు**

**మీడియా పాయింట్ వద్ద కెటిఆర్ విమర్శలు**

**హైదరాబాద్,మార్చి12:** గాంధీ భవన్‌లో కాంగ్రెస్ కార్యకర్తల ప్రెస్‌మీట్‌లా గవర్నర్ ప్రసంగం ఉందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ల కల్వకుంట్ల తారకరామారావు విమర్శించారు. గవర్నర్ ప్రసంగం అనంతరం శాసనసభ మీడియా పాయింట్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన 420 హామీలు ఈ ప్రభుత్వం, ఆరు గ్యారంటీల గురించి ఏమైనా కొత్త విషయాలు చెబుతారేమోనని అనుకున్నామన్నారు. 'గత 15నెలల పేలవమైన, అట్టర్‌ఎ÷-లాప్ పరిపాలన గురించి ప్రాయశ్చిత్తం చేసుకునేవిధంగా గవర్నర్ ప్రసంగం ఉంటుందని భావించాం. ఇది గవర్నర్ ప్రసంగం లేదు. ఒకమాటలో చెప్పాలంటే గాంధీ భవన్‌లో కాంగ్రెస్ కార్యకర్తల ప్రెస్‌మీట్‌లా ఉంది తప్పా.. గవర్నర్ ప్రసంగంలా లేదు. గవర్నర్ నోటి వెంట ఒకటికాదు రెండు చాలా అబద్దాలు చెప్పించారు. గవర్నర్ నోటివెంట అసత్యాలు పలకాల్సి రావడంపై బాధపడుతున్నాం. కాంగ్రెస్ సర్కారు ఘోర వైఫల్యం వల్ల ఈ రోజు రాష్ట్రంలో రైతాంగం ఆందోళనలో ఉందని కేటీఆర్ తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడికక్కడ పంటలు ఎండిపోతున్నయ్. ఇప్పటికే 480 పైచీలుకు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. కనీసం ఒక మాట రైతులకు స్వాంతన చేకూర్చే, ఉపశమనం, భరోసా ఇచ్చేమాట గవర్నర్ నోటినుంచి వస్తుందేమోననని ఆశించాం. పంటలు ఎండిపోకుండా కాపాడుతాం. పంటలకు నీరు ఇస్తాం. బుద్ధి తెచ్చుకున్నాం. ఇకనైనా బుద్ధితో మెదులుతామని చెప్పి ఒక్క మాట చెబుతారని అనుకున్నాం. వారి నోటివెంట ఒక్క మాట రాలేదు. అసలు ఈ రోజు వరకు రాష్ట్రంలోని ఏ గ్రామంలో కూడా 25శాతం నుంచి 30శాతానికి మించి రుణమాఫీ జరుగలేదు. దీనిపై పోయిన శాసనసభలో ప్రభుత్వాన్ని అడిగినం. సీఎం సొంత ఊరికి పోదామా? సొంత నియోజకర్గానికి



పోదామా? ప్లేస్, సమయం మీ ఇష్టం.. ఊరు మీష్టం అని చెప్పాం. ఒక ఊరిలో వందశాతం రుణమాఫీ జరిగితే మేం అందరం రాజీనామా చేస్తామని చెప్పాం. కానీ, మళ్లీ ఈ రోజు గవర్నర్ నోటివెంట రుణమాఫీ అయిపోయింది.. లక్షలాది మంది రైతులు సంతోషంగా ఉన్నరని గవర్నర్‌తో అబద్దాలు చెప్పించి.. గవర్నర్ స్థాయిని సైతం దిగజార్చి మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వం తన భ్రష్టత్వాన్ని, నీచత్వాన్ని బయటపెట్టుకుంది' అంటూ కేటీఆర్ మండిపడ్డారు..

# ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తే సహించేది లేదు

**అవినీతికి పాల్పడే ఉద్యోగులు,అధికారులపై చర్యలు తప్పవు**

**ప్రజా ప్రతినిధులు,అధికారులు డబ్బులు వసూళ్లు చేస్తే కఠిన చర్యలు**

**మార్చి నెలాఖరులోగా ప్రతి పని ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి**

**వేసవి తాపం ఎక్కడ కనిపించకుండా చూసుకోవాలి.**

**సమీక్షల ప్రతి అంశం పై క్షేత్ర స్థాయి పరిశీలన అవసరం**

**మున్సిపల్ కార్పొరేషన్ ప్రక్షాళన తప్పనిసరి**

**వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి**



**తొలిసమయం వరంగల్ మార్చి 12**

ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తే సహించేది లేదని బడ్జెట్ చివరి మాసం,కొత్త బడ్జెట్ ప్రవేశపెట్టే క్రమంలో నియోజవర్గ పరిధిలో పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనులను ప్రారంబించాలని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి సూచించారు మంగళవారం రోజున కూడా కార్యాలయంలో నిర్వహించిన వరంగల్ పశ్చిమ నియోజవర్గ సమీక్ష సమావేశంలో నగర మేయర్ గుండు సుధారాణి,కూడా చైర్మన్ ఇనుగల వెంకట్రామ్ రెడ్డి,కమిషన్అశ్విని తానాజీవాకడేలతో కలిసి సమీక్షించారు. నగరంలో పెండింగ్ లలో ఉన్న పనులను త్వరితగతిన ప్రారంభించాలని,స్మార్ట్ సిటి నిధుల ద్వారా జరుగుతున్న పనుల పురోగతిపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే నాయిని తెలిపారు.రోడ్డు విస్తరణ,భద్రకాళి అభివృద్ధిలో ఇళ్లు కోల్పోతున్న వారికి రెండు పడకల ఇళ్లు ఇచ్చేలా చూడాలని కోరారు.నిజమైన అర్హులను గుర్తించాలని అధికారులను ఆదేశించారు.భద్రకాళి బండ్ పనులు 75% జరిగిందని అధికారులు ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకొచ్చారు.

**వేసవికాలం ఆక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి :నాయిని**

వేసవికాలం సమీపించిన సమయంలో నగరంలోని ప్రజలకు ఎటువంటి నీటి ఎద్దడి లేకుండా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.మూతబడిన బోర్లను వెంటనే మరమత్తులు చేయాలని,అవసరం ఉన్న ప్రాంతాల్లో కొత్త బోర్లకు అనుమతులు మంజూరు చేయాలని సూచించారు.వేసవితాపం తీర్చేందుకు మూడు నెలలు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు.వేసవి సెలవుల నేపథ్యంలో పిల్లలకు నియోజవర్గంలో ఉన్న 24 ప్రధాన పార్కులలో మరమత్తులు చేపట్టాలని సూచించారు.మున్సిపల్ మరియు %ఖఖణా% అధికారులు ఉద్యానవనం శాఖ అధికారులు సమిష్టిగా నగరంలో మొక్కల పెంపకం,పచ్చదనం పై నూతన ఒరవడికి నాంది పలకాలని కోరారు.చాలా చోట్ల మొక్కలు నాటాల్సిన ప్రాంతాల్లో పార్కింగ్ ఏర్పాటు చేయడం వల్ల మొక్కల పెరుగుదల లేదని అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ ప్రక్షాళన చేయాలని,అవినీతికి పాల్పడుతున్న అధికారులు,ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే విధంగా ప్రజా ప్రతినిధులు,అధికారులు అవినీతికి పాల్పడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.సమీక్షలో చేపట్టిన అంశాల పట్ల అధికారులు కింది స్థాయి ఉద్యోగులతో క్షేత్ర స్థాయిలో పరిశీలించండి అని సూచించారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం,గౌ ముఖ్యమంత్రి గారు వరంగల్ నగర అభివృద్ధి పై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని,ప్రజా ప్రతినిధులు,అధికారులు సమన్వయంతో ప్రజా పాలన సాగించాలని అన్నారు.ఈ సమీక్ష సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.

# ప్రగతి గ్రామ సమైక్య మహిళా దినోత్సవ వేడుకలు

**ఎస్.ఆర్.కె.టి స్కూల్ మేదర బస్తి సహకారంతో వేడుకలు**

**500 మంది మహిళలతో ఘనంగా వేడుకలు**

**ముఖ్య అతిథులుగా పాల్గొన్న మాజీ మున్సిపల్ చైర్పర్సన్ కాపు సీతాలక్ష్మి**

**మహిళ శిశు సంక్షేమ అధికారి స్వర్ణలత లెనినా**

**డాక్టర్ సాగరిక గైనకాలజిస్ట్ మాతా శిశు ఆస్పటల్**

**డిస్టిక్ మిషన్ కోఆర్డినేటర్ రూప ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు సెక్రటరీలకు ఘన సన్మానం**





**తొలి సమయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మార్చి 12**

చుంచుపల్లి మండలం గౌతమ్ పూర్ ప్రగతి గ్రామ సమాఖ్య వివో పద్మ ఆధ్వర్యంలో ఎస్ ఆర్ కే.టి స్కూల్ మేదర బస్తి కొత్తగూడెం వారి సహకారంతో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా సింగరేణి గౌతమ్ పూర్ కమ్యూనిటీ హాల్లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత లేనిన డాక్టర్ సాగరిక గైనకాలజిస్ట్ మాతా శిశు ఆస్పటల్ రామవరం డిస్టిక్ మిషన కోఆర్డినేటర్ రూప పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల సమానత్వం ఇంటి నుండే ప్రారంభం కావాలని నిరంతరం మహిళను గౌరవించాలని ఇంట్లో మగ పిల్లలను ఆడపిల్లలను సమానంగా చూడాలని వారన్నారు. సమాజంలో పురుషులతో పాటు మహిళలకు సమాన హక్కులు కలిగి ఉండాలని విద్యా ఉపాధి రాజకీయ రంగాలలో మహిళల భాగస్వామ్యం పెరగాలని ప్రభుత్వ ప్రైవేటు రంగాలలో మహిళలు కీలక స్థానాలను అధిరోహించాలని వారన్నారు. మాజీ చైర్పర్సన్ సీతా లక్ష్మీ మాట్లాడుతూ భర్త కాపు కృష్ణ ప్రోత్సాహంతో రాజకీయాల్లోకి రావడం జరిగిందని అంతకుముందు టీచర్గా పని చేశానని మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని పురుషులతో సమానంగా ప్రభుత్వ ప్రైవేటు రంగాలలో ఉన్నారని అన్నారు. ఇంత పెద్ద కార్యక్రమాన్ని నిర్వహించిన కార్యానిర్వహకులు వివోఏ పద్మ రత్నకుమార్ ని అభినందించిన మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ టిఆర్ఎస్ నాయకురాలు కాపు సీతాలక్ష్మి.. ఈ సందర్భంగా మహిళా శిశు సంక్షేమ అధికారి స్వర్ణలత లేని నా మాట్లాడుతూ చదివే మహిళ సాధికారతకు ప్రధాన ఆధారమని అమ్మాయిలు చదువు ఆ కుటుంబానికి వెలుగునిస్తుందని తల్లిదండ్రులు తమ కుమార్తెకు పూర్తి స్వేచ్ఛనిస్తూ మంచి విద్యను అందించాలని వారు అన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని వారన్నారు. మహిళల కొరకు ఇందిరా శక్తి అనే కార్యక్రమాలు ప్రభుత్వం ఏర్పాటు చేసిందని అన్ని రంగాల్లో మహిళలు ఉండాలని ప్రభుత్వం ఇటువంటి ఏర్పాట్లు చేస్తున్నారు. అన్ని పథకాలు మహిళా చేతుల్లోనూ ఉంటున్నాయని భర్త వంద రూపాయలు ఇవ్వు అనే పరిస్థితి వచ్చిందని మహిళా విజయమని అన్నారు. అనంతరం డిస్టిక్ కోఆర్డినేటర్ రూప మాట్లాడుతూ ఈ సంక్షేమ శాఖలో ట్రాన్స్జెటర్ మహిళలు బాలికలు అందరికీ అండగా ఉంటుందని ఎవరైనా మనకు కష్టం వస్తే 181 కి కాల్ చేయవచ్చు అని మీకు ఏ కష్టం వచ్చినా ముందుగా చెప్పుకోవాలని వారు అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించిన ప్రగతి గ్రామ సమాఖ్య. గెలుపొందిన వారికి బహుమతులు అందజేయడం జరిగింది. అనంతరం వందమంది మహిళలను సన్మానించడం జరిగింది. ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు పంచాయతీ మహిళ సెక్రటరీలను శ్వేత మండల సమైక్య సీసీలు చుంచుపల్లి మండల వివో ఏల కు బొకే అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించిన ప్రగతి గ్రామ సమైక్య. మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా లందరికీ శుభాకాంక్షలు తెలియజేసిన ప్రగతి గ్రామ సమాఖ్య అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల ఆర్గనైజర్ రత్నకుమార్.ఈ కార్యక్రమంలో మహిళా దినోత్సవ కమిటీ సభ్యులు ఉమా సుమ లావణ్య మల్లేశ్వరి మహిళ సాదరిక సభ్యులు సాహితీ ప్రియాంక సీసీలు భాగ్యమ్మ సత్యవతి పంచాయితీల మహిళా సెక్రటరీలు జక్కంపూడి షర్మిల అజ్మీరా ఇందిరా దండబోయిన లలిత బూదకూరి నర్మదా బానోతు భూమిక వివో ఏలు స్వర్ణ రేఖ రేష్మా రోస్ రమ జయ జాల విజయ కావ్య మై మున్నీసా స్వరూప లక్ష్మి యమునా శ్రీలత లావణ్య సంకీర్తన మహేశ్వరి సరిత అకౌంటెంట్ వింధ్య ఎమ్మెస్ అధ్యక్షురాలు రాజకుమారి. అందర్నీ ఉత్తేజపరిచిన యాంకర్ స్నేహ. కార్యక్రమం విజయవంతంలో కృషిచేసిన మాజీ వార్డు నెంబర్ శివ లక్ష్మణ్ సతీష్ గిరి కి కృతజ్ఞతలు తెలియజేసిన ప్రగతి గ్రామ సమైక్య.

## ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్ చేసిన ఎస్ఐ

**అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు ఎస్సై రమణారెడ్డి**

**తొలి సమయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మార్చి 12**

లక్ష్మీదేవిపల్లి, మండలం ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేసినట్లుగా లక్ష్మీదేవిపల్లి ఎస్ఐ రమణారెడ్డి తెలిపారు. ఎస్ఐ పూర్తి కథనం ప్రకారం లక్ష్మీదేవిపల్లి మండలం లోని అనిశెట్టిపల్లి గ్రామం లోని ముర్రేడు వాగు నుంచి అక్రమంగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారన్న సమాచారం మేరకు బుధవారం రోజు ఉదయం మాటువేసి ఇసుక ట్రాక్టర్ ను పట్టుకొని సీజ్ చేసినట్లుగా ఎస్సై తెలిపారు. పట్టుకున్న ట్రాక్టర్ డ్రైవర్ మరియు ఓనర్ పై కేసు నమోదు చేసినట్లుగా పేర్కొన్నారు.




మండలంలో అధికారుల అనుమతులు లేకుండా అక్రమంగా ముర్రేడు వాగు నుంచి ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా ముర్రేడు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే తనకు సమాచారం ఇవ్వాలని సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ రమణారెడ్డి తెలిపారు.

## సత్యం కంప్యూటర్ ఎడ్యుకేషన్

# 24వ ఏళ్ళ సుదీర్ఘ ప్రస్థానం

**సహకరించిన విద్యార్థులకు, ఉద్యోగులకు,**

**తల్లిదండ్రులకు 24వ వార్షికోత్సవ శుభాకాంక్షలు**

**6రాష్టాలకు విస్తరించి తమ సేవలను అందుబాటులో**

**మీరు ఇచ్చిన ప్రోత్సాహంతో గోల్డెన్ ఓక్ పాఠశాలను ప్రారంభించి నాణ్యమైన విద్యను అందిస్తున్నాము**

**సత్యం గ్రూప్స్ అధినేత గంట రవికుమార్**



**తొలిసమయం వరంగల్ మార్చి 12**

సత్యం కన్వెన్షన్ హాల్ లో బుధవారం జరిగిన సత్యం వార్షికోత్సవ వేడుకకి సత్యం గ్రూప్స్ అధినేత గంట రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ జిల్లాలో 2001 సంవత్సరంలో ప్రారంభించిన సత్యం కంప్యూటర్ ఎడ్యుకేషన్ 24వ ఏళ్ళ సుదీర్ఘ ప్రస్థానానికి సహకరించిన విద్యార్థులకు, ఉద్యోగులకు, తల్లిదండ్రులకు 24వ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు చూపిన ఆధారాణే, ప్రేరణగా తెలంగాణలో పలు బ్రాంచ్ లు స్థాపించి అనతి కాలంలోనే 6రాష్టాలకు విస్తరించి తమ సేవలను అందిస్తున్నామని, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తమ బోధన విధానాన్ని మార్చుకొంటూ ఎప్పటికప్పుడు నిత్యనూతనంగా ముందుకు సాగిపోతూ పలు రంగాల్లో వివిధ హెూదాలో ఎంతో మంది విద్యార్థులు స్థిరపడ్డారని అందుకు గర్వంగా ఉందని, మీరు ఇచ్చిన ప్రోత్సాహంతో గోల్డెన్ ఓక్ పాఠశాలను ప్రారంభించి నాణ్యమైన విద్యను అందిస్తున్నామని రవికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ కందుకూరి విజయ్ కుమార్, కలువల శ్రీనివాస్, సెంటర్ కోఆర్డినేటర్స్ పోశాల సతీష్, ఎర్ర ప్రకాష్, సెంటర్ మేనేజర్స్ దార భాస్కర్, మామిడి రంజీత్, వడ్లకొండ రాజు నారాయణ, నేరెళ్ల క్రాంతి, తౌటం శ్రవణ్, ట్రైనర్స్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## యువకుడిని కాపాడిన మట్టేవాడ పోలీసులు

**మట్టెవాడ పోలీస్ సిబ్బంది, ఫైర్ సిబ్బందిపై హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు**

**తొలి సమయం వరంగల్ మార్చి 12**



ఎల్లం బజారుకు చెందిన ఓ వ్యక్తి బుధవారం తన వ్యక్తిగత సమస్యలతో రెండంతస్తుల భవనం పైకి చేరుకొని ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నిస్తుండగా మట్టేవాడ పోలీసులు ఆ వ్యక్తిని కాపాడారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ నగరంలోని ఎల్లం బజార్ కు చెందిన కట్టుకోజు శివకుమార్ అనే వ్యాపారి తన వ్యక్తిగత సమస్యలతో ఎల్లం బజార్ లోని ఆదర్శ వీధి లోని మహబూబియా పంచధన్ కాలేజీ ఎదురుగా ఉన్న రెండంతస్తుల బిల్డింగ్ పై నుండి దూకి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నిస్తుండగా స్థానికులు వెంటనే డైల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న మట్టేవాడ బ్లూ కోర్టు సిబ్బంది ఆ వ్యక్తిని బిల్డింగ్ పై నుంచి కిందికి దించి సురక్షితంగా రక్షించి తన కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో నగర ప్రజలు మట్టెవాడ పోలీస్ సిబ్బంది, ఫైర్ సిబ్బందిపై హర్షం వ్యక్తం చేశారు.

## స్వయం పాలన దినోత్సవం

**ధర్మారపు రమేష్ హెచ్ఎం**

**తొలి సమయం దంతాలపల్లి మార్చ్ 12**



దంతాలపల్లి మండలం దొనకొండ గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో స్వయం పాలన దినోత్సవం ఘనంగా జరిగినది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ధర్మారపు రమేష్ మాట్లాడుతూ పిల్లలు భవిష్యత్తులో ఏం చేయాలనే ఆలోచనను ఈ కార్యక్రమం కలగజేస్తుందని తెలిపారు. ఇప్పటినుంచే వారు ఒక గోల్ ఏర్పరచుకొని ముందుకు వెళ్లాలని కోరారు. పిల్లలు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సహోపాధ్యాయురాలు మాధవి అన్నారు.

# సమయపాలన పాటించి ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలి

**ఎండాకాలంలో వచ్చే ఆరోగ్య సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలి**

**జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.సాంబశివరావు...**

**సఖీ సెంటర్ చేస్తున్న సేవలపై క్యాలెండర్ ఆవిష్కరణ**



**తొలిసమయం వరంగల్ మార్చి 12**
ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పల్లె దవఖానాలు, ప్రజల ఆరోగ్య అవసరాలకు నిర్మించారని కావున సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.సాంబశివరావు అన్నారు.వరంగల్ జిల్లాలోని ధర్మారం, మహేశ్వరం లలోని ఆరోగ్య ఉప కేంద్రాలు, అంగన్వాడి సెంటర్ లలో బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.సాంబశివరావు ఆకస్మికంగా తనిఖీ చేసి ప్రజలకు అందించవలసిన వైద్య సేవలు, సమయపాలన గురించి వివరించారు. ప్రభుత్వం ఈ సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.సాంబశివరావు మాట్లాడుతూ నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని మాతా శిశు సంరక్షణ, ప్రభుత్వ హాస్పిటల్ లో డెలివరీలు, వ్యాధి నిరోధక టీకాలు, అందించాలని కోరారు. సంక్రమిత, అసంక్రమిత వ్యాధులు నిర్ధారణ పరీక్షలు చేయించి తగు చికిత్సలు అందించాలన్నారు. ప్రజలు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సూచనలు పాటిస్తూ ఆరోగ్యంగా ఉండడానికి ప్రయత్నం చేయాలని, ఏమైనా ఆరోగ్య సమస్యలు వచ్చినట్లయితే వెంటనే వైద్య సిబ్బంది ద్వారా తగు చికిత్సలు తీసుకోవాలన్నారు. వైద్యాధికారులు, సిబ్బంది ప్రజలకు అందించవలసిన సేవలు, సిబ్బంది విధుల గురించి తగిన సూచనలు చేశారు. సమయపాలన పాటించని ఉద్యోగులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

అనంతరం అంగన్వాడి సెంటర్ లలోని పిల్లల ఆరోగ్య స్థితిని పరిశీలించి అంగన్వాడి సిబ్బందికి తగిన సూచనలు చేశారు. సఖి సెంటర్ నుంచి వచ్చేసిన సిబ్బంది ద్వారా ప్రజలలో అవగాహన కల్పించడం సఖి సెంట్రల్ సేవల గురించి తెలిపారు. అనంతరం సఖీ సెంటర్ చేస్తున్న సేవల క్యాలెండర్ ఆవిష్కరించి, ఎండాకాలంలో వచ్చే ఆరోగ్య సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఎలాంటి వ్యాధులకు గురి అయిన వెంటనే వారికి తగిన చికిత్సలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ, డిఐఓ డాక్టర్ ప్రకాష్, డెమో అనిల్ కుమార్, ఆరోగ్య ఉప కేంద్రాల వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# గురుకులాల్లో నాణ్యమైన భోజనం, పరిశుభ్రత, వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

**విద్యార్థులకు అందించే భోజనం మెనూ ప్రకారం నాణ్యతగా అందించాలి**

**హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య**

**జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గురుకులాలు, కస్తూరిబా విద్యాలాయాల్లో**

**ఫుడ్ సేఫ్టీ, వసతుల కల్పన, ఇతర అభివృద్ధి పనుల పై వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం**



**తొలి సమయం హన్మకొండ మార్చి 12**
గురుకులాల్లో నాణ్యమైన భోజనం, పరిశుభ్రత, టాయిలెట్ల నిర్వహణ బాగుండే విధంగా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గురుకులాలు, కస్తూరిబా విద్యాలాయాల్లో ఫుడ్ సేఫ్టీ, వసతుల కల్పన, ఇతర అభివృద్ధి పనుల పై వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో మొత్తం 110 గురుకులాలు ఉన్నాయని, భోజనం, ఇతర వసతులను జిల్లా అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారని జిల్లా రెవెన్యూ అధికారి వై. వి. గణేష్ కలెక్టర్ కు వివరించారు. గురుకులాల్లో తాగునీరు, టాయిలెట్స్, మెష్ డోర్స్, కాంపౌండ్ వాల్స్, ఇతర మౌలిక వసతుల గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వివిధ గురుకులాల్లో సమస్యలు కలెక్టర్ అడిగి తెలుసుకుని వాటి పరిష్కరానికీ తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ గురుకులాల్లో కల్పిస్తున్న వసతుల పై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గురుకులాల్లోని అన్ని వసతులు బాగుండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. గురుకుల విద్యాలయాల్లో అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేసి అందించాలన్నారు. గురుకులాల్లో విద్యార్థులకు అందించే భోజనం మెనూ ప్రకారం నాణ్యతగా అందించాలని, బియ్యం, పాలు, కూరగాయలు, ఇతర సరకులు నాణ్యతగా ఉండాలన్నారు. మైనర్ రిపేర్లను త్వరగా పూర్తి చేయాలన్నారు. మిషన్ భగీరథ ద్వారా గురుకులాలకు నీటి సరఫరా జరగాలన్నారు. సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనంతో పాటు పరిశుభ్రత, టాయిలెట్ల నిర్వహణ బాగుండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, డిఈవో వాసంతి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కొమరయ్య, పౌరసరఫరాల కార్పొరేషన్ మేనేజర్ మహేందర్, జిల్లా సంక్షేమ అధికారి జయంతి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శ్రీలత, వివిధ గురుకులాల అధికారులు పాల్గొన్నారు.

# రైతుల ప్రైవేటు అప్పులు తీర్చేందుకు ఇక బ్యాంకు రుణాలు

**బ్యాంకర్లు,వ్యవసాయ అధికారులతో న్యాయ సేవాధికారుల సమావేశం**

**వినియోగించుకోవాలని కోరిన పాకాల శ్రీహరి రావు**




**తొలి సమయం డెస్క్ మార్చి,12**
పంట రుణాలకు అదనంగా తమ ప్రైవేటు అప్పులను తీర్చుకోవడానికి తక్షణం లక్ష రూపాయల మేరకు రైతులకు రుణాలు మంజూరు చేసేందుకు బ్యాంకర్లు సంసిద్ధత వ్యక్తం చేసిన నేపథ్యంలో జిల్లాలోని రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాకాల శ్రీహరిరావు కోరారు. బుధవారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు తమ ప్రైవేటు అప్పులు తీర్చుకునేందుకు బ్యాంకుల నుండి రుణం పొందే అవకాశం ఉన్నందున దానికోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రైవేట్ అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతులను ఆ ఊబి నుండి బయటకు తెచ్చే ఉద్దేశంతో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చేసిన మార్గదర్శకాల అమలుకు ఎట్టకేలకు ముందడుగు పడింది. వడ్డీ వ్యాపారుల చేతుల్లో ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నరైతులకు పంట రుణాలతో పాటు,వారు చేసిన ప్రైవేటు అప్పులను తీర్చేందుకు రుణాలు మంజూరు చేయాలన్న రిజర్వ్ బ్యాంక్ నిబంధనలు ఇంతకాలం దాచి ఉంచిన బ్యాంకర్లు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాలతో దిగివచ్చారు. రిజర్వ్ బ్యాంక్ మార్గదర్శకాలను ప్రభుత్వ రంగ బ్యాంకులు అమలు చేయడం లేదని, ప్రైవేట్ అప్పులు తీర్చేందుకు రుణాలు ఇచ్చే నిబంధన గురించి రైతులకు తెలిసే విధంగా ప్రచారం చేయలేదని రైతు రక్షణ సమితి తరపున శ్రీహరి రావు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ విచారించిన ఉన్నత న్యాయస్థానం డబ్ల్యూపి(పిల్) 269/2018 ప్రకారం బ్యాంకుల నుంచి రైతులు తమ ప్రైవేటు అప్పులను తీర్చేందుకు రుణాలు పొంద వచ్చని ఆదేశాలు జారీ చేసింది.ఈ ఆదేశాల అమలుకు గాను సంబంధిత బ్యాంకు మేనేజర్లు, వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశం ఏర్పాటు చేయాలని, అర్హులైన రైతులందరికి " ప్రైవేట్ అప్పులు తీర్చుకోడానికి రుణాలు మంజూరు అయ్యే విధంగా చూడాలని రాష్ట్రంలోని అన్ని జిల్లాల న్యాయ సేవా సంస్థలచైర్ పర్సన్లకు,రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి గత నెల 27న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో బ్యాంకర్లు, వ్యవసాయ అధికారులు, రైతు సంఘాల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సమావేశంలో న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ శ్రీమతి బి ప్రతిమ, కార్యదర్శి కే వెంకటేష్,తెలంగాణ రైతు రక్షక సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాకాల శ్రీహరి రావు, సమితి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆంజనేయులు,ప్రభుత్వ రంగ బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు. ప్రైవేటు అప్పుల కారణంగా రాష్ట్రంలోని రైతుల ఆర్థిక పరిస్థితి నానాటికి దిగజారి పోతున్న తరుణంలో వారిని ఆ అప్పుల ఊబి నుండి బయటకు తేవాలని, అందుకోసం రిజర్వ్ బ్యాంక్ నిబంధనలు, హైకోర్టు ఆదేశాల మేరకు పంట రుణాలకు అదనంగా రైతులకు ప్రైవేట్ అప్పులపై రుణాలు ఇవ్వాలని, అందుకు అవసరమైన చర్యలు వెంటనే తీసుకోవాలని న్యాయ సేవాధికార సంస్థ బ్యాంకర్లు, వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించింది. అవసరమున్న రైతులందరికీ, వారి ప్రైవేట్ అప్పులు తీర్చుకోడానికి సంబంధిత బ్యాంకులు పంట రుణాలకు అధనంగా మొదటి ప్రాధాన్యతతో దీర్ఘ కాలిక రుణాలు మంజూరు చెయ్యాలని,అప్పు అవసరమున్న రైతులందరు వెంటనే సంబంధిత బ్యాంకులలో దరఖాస్తు చేసుకోవచ్చని న్యాయ సేవాధికార సంస్థ ప్రతినిధులు సూచించారు.ఏదైనా కారణాలతో బ్యాంకులు రైతులకు వారి ప్రైవేట్ అప్పులపై రుణాలు మంజూరు చెయ్య లేక పోతే, అందుకు గల కారణాలను రాత పూర్వకంగా రైతులకు తెలపాలని సూచించారు.

## బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్‌లో ఉచిత శిక్షణ

**తొలిసమయం మహబూబాబాద్ మార్చి 12**




హైదరాబాద్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ శిక్షణా సంస్థ ద్వారా బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ లో బి.సి. విద్యార్థులకు ఒక నెల పాటు నాన్ రెసిడెన్షియల్ ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బి.సి. స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్.ఎంపీవీ ప్రసాద్ నేడు ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ పూర్తిచేసుకున్న అభ్యర్థులకు ప్రైవేటు బ్యాంకుల్లో ప్లేస్ మెంట్ కల్పిస్తారని ఆయన తెలిపారు. డిగ్రీ పూర్తయిన 26 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న అభ్యర్థులు అర్హులని ఆయన తెలిపారు. ఈనెల 15వతేదీ నుండి ఏప్రిల్ 8వ తేదీ వరకు దరఖాస్తులను **www.tgbcstudycircle.cgg.gov.in** ఆన్ లైన్ ద్వారా చేసుకోవాలని ఆయన తెలిపారు. అభ్యర్థి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతంలో 1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో 2 లక్షలలోపు ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఆన్ లైన్ ద్వారా పరీక్ష ఉంటుందని, పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా (30) మందిని ఎంపిక చేస్తారని ఆయన తెలిపారు. మరింత సమాచారం కోసం 040-29303130 ని సంప్రదించాలని ఆయన కోరారు.

## ఎర్రబెల్లి ఉషమ్మ- దయన్న
## ఆదర్శ దంపతులకు వార్షికోత్సవ శుభాకాంక్షలు

**తొలి సమయం తొర్రూరు మార్చి 12**



మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఉషమ్మ ఆదర్శ దంపతులకు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలియజేసి పలు మండల కేంద్రాలలో కేక్ కట్ చేసిన మండల నాయకులు ప్రతి మండలంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు వివాహ వార్షికోత్సవ సందర్భంగా పలువురు మిఠాయిలు పంపిణీ చేసుకున్నారు కేకులు కట్ చేశారు ఈ సందర్భంగా ఈ దంపతులు నిండు నూరేళ్లు ఉండాలని రాబోయే రోజులలో తిరిగి ఎమ్మెల్యేగా మెజారిటీతో గెలవాలని పాలకుర్తి మండలం లోని ప్రజలు నాయకులు కోరుకుంటున్నారు.

## గీతా కార్మికునికి గోపా నాయకుల పరామర్శ




**తొలి సమయం తొర్రూరు మార్చి 12**
తొర్రూరు మండలంలోని సోమారం గ్రామానికి చెందిన గీతా కార్మికుడు రావుల దామోదర్ గౌడ్ ఇటీవల ప్రమాదవశాత్తు తాటి చెట్టు పై నుండి పడి కాలు విరగడంతో బుధవారం గోపా సంఘం నాయకులు సందర్శించి పరామర్శించారు.ఈ సందర్భంగా గోపా జిల్లా అధ్యక్షులు కుర్ర శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ తాటి చెట్టు నుంచి పడిన గీత కార్మికులను ప్రభుత్వం వెంటనే ఎక్స్‌గ్రేసియా ఇచ్చి ఆదుకోవాలని, అంగవైకల్యం చెంది ఎన్నో కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఉందని, తాటి కల్లు అమ్ముకొని జివించే గీత కార్మికులకు ఆర్థిక సహాయం, కాటమయ్య రక్షణ కవచాలు కూడా వెంటనే గీత కార్మికులకు ఇవ్వాలని అన్నారు. కల్లు గీత కార్మికులను ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో కంఠమహేశ్వర గౌడ సంఘం తొర్రూరు అధ్యక్షులు నిమ్మల శేఖర్ గౌడ్,గౌడ సహకార పరపతి సంఘం కార్యవర్గ సభ్యులు రావుల సదానందం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


## స్వర్గీయ జాధవ్ సకారం కుటుంబాన్ని పరామర్శంచి "శ్రద్ధాంజలి ఘటించిన
## రెహమాన్ ఫౌండేషన్ సభ్యులు"

**ఆ పేద కుటుంబానికి 8000/- వేల రూపాయలు ఆర్థిక భరోసా అందజేత**

**సామాజిక సేవ కోసమే రెహమాన్ ఫౌండేషన్**

**చైర్మన్ డాక్టర్ షేక్ అబ్దుల్ రెహమాన్ జిలాని**

**తొలి సమయం డెస్క్ మర్చి 12:**



ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ మండల కేంద్రానికి చెందిన స్వర్గీయ జాధవ్ సకారం నాయక్ (65) గత కొద్ది రోజుల క్రితం స్వర్గస్థులైనారు. బుధవారం దశదిన పెద్దకర్మ (తేర్వి) కార్యక్రమంలో రెహమాన్ ఫౌండేషన్ మండల ఇంచార్జి జాటోత్ దవిత్ కుమార్ బృందం సభ్యులు పాల్గొని చిత్ర పటానికి నివాళి అర్పించారు. రెహమాన్ ఫౌండేషన్ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా చైర్మన్ డాక్టర్ షేక్ అబ్దుల్ రెహమాన్ జిలానీ సహకారంతో...... ఫౌండేషన్ లింగాపూర్ మండల ఇంచార్జి సభ్యులు జాటోత్ దవిత్ కుమార్ ద్వారా మృతుని సతీమణి రత్తిబాయి, పెద్ద కుమారులు జాధవ్ దేవిదాష్, సత్యపాల్ కి 8000/- వేల రూపాయలు నగదును అందిజేశారు. మృతుని ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు ధైర్యం ఇవ్వాలని కోరుతూ ప్రగాఢ సానుభూతి తెలిపారు. సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే ప్రతి పేద కుటుంబాలకు రెహమాన్ ఫౌండేషన్ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రాథోడ్ సంతోష్, జాధవ్ మారుతీ, దవనే విశ్వకాంత్, రాథోడ్ కిషన్, రాథోడ్ ధర్మెందర్, రాథోడ్ నరేందర్ గ్రామ పెద్దలు, యువకులు తదితరులు ఉన్నారు.!!

## సమగ్ర వ్యవసాయంతోనే అధిక దిగుబడులు,సాధించవచ్చు

**జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్**




**తొలి సమయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మార్చి 12**
సమగ్ర వ్యవసాయం తోనే అధిక దిగుబడులు సాధించవచ్చు అని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. బుధవారం రామవరం లోని రైతు వేదికలో వాలంతరి, రాజేంద్రనగర్ హైదరాబాద్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ బృందంతో ఏ ఈ ఓ లకు, రైతులకు నీటి నిర్వహణ, మట్టి, నీటి సంరక్షణ, యాజమాన్య పద్ధతులపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమగ్ర వ్యవసాయంతోనే అధిక దిగుబడులు సాధించవచ్చని ఇందుకుగాను నీటి కుంటల నిర్మాణం, మునగ సాగు, ఆయిల్ ఫామ్, అజోల్ల పెంపకం, తిప్పు, కరక్కాయ వంటి ఔషధ మొక్కలను పుట్టగొడుగుల పెంపకం, పెంపకం, తుల పెంపకం ద్వారా రైతులు అదనంగా ఆదాయం సంపాదించవచ్చని, ఆ దిశగా రైతులను ప్రోత్సహించాలని ఏఈఓ లను ఆదేశించారు. రెండు రోజులపాటు నిర్వహించే ఈ శిక్షణ కార్యక్రమంలో డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్ ఇరిగేషన్, ప్రకృతి వ్యవసాయం, పంట మార్పిడి మరియు జిల్లాలోని వ్యవసాయకు సంబంధించిన ప్రస్తుత పంటల యొక్క సమస్యలు మరియు పరిష్కారాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగపరుచుకోవాలని కోరారు.
ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు,వాలంతరీ డైరెక్టర్ విజయ గౌరీ, వ్యవసాయ సహాయ సంచాలకులు నరసింహారావు మరియు వాలంతరీ ఏ డి ఏ సునీత మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పూడికతీత మట్టి తరలింపు వేగంగా జరగాలి

**హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు పి.ప్రావీణ్య, డాక్టర్ సత్య శారద**

**భద్రకాళి చెరువు నుండి పూడికతీత మట్టి తరలింపు రూట్ మ్యాప్, వాహనాల రాకపోకలకు సంబంధించి వేస్తున్న ఫార్మేషన్ రోడ్డు పనులు, మట్టి తరలించేందుకు ఇచ్చే వాహనాల కూపన్లను పరిశీలన**

**పూడికతీత మట్టి పనులు సజావుగా సాగేటట్టు అధికారులు సమన్వయంతో కృషి చేయాలి**



**తొలిసమయం వరంగల్ మార్చి 12**
భద్రకాళి చెరువు పూడికతీత మట్టి తరలింపు ప్రక్రియ వేగవంతంగా జరగాలని హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు పి.ప్రావీణ్య, డాక్టర్ సత్య శారద అన్నారు. మంగళవారం భద్రకాళి చెరువు లో పూడికతీత పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో కలెక్టర్లు, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తో కలిసి పరిశీలించారు. భద్రకాళి చెరువు నుండి పూడికతీత మట్టి తరలింపు రూట్ మ్యాప్, వాహనాల రాకపోకలకు సంబంధించి వేస్తున్న ఫార్మేషన్ రోడ్డు పనులు, మట్టి తరలించేందుకు ఇచ్చే వాహనాల కూపన్లను పరిశీలించారు. భద్రకాళి చెరువు పూడికతీత మట్టిని ఎంత తరలించారనే వివరాలను నీటిపారుదల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెరువులో నుండి కట్టవరకు చేపట్టిన ఫార్మేషన్ రోడ్డు పనులను పరిశీలించి ఈ సందర్భంగా కలెక్టర్లు ప్రావీణ్య, డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ భద్రకాళి చెరువు పూడికతీత మట్టి తరలింపును అధికారులు వేగవంతం చేయాలన్నారు. పూడికతీత మట్టి ని బుధవారం నుండి ప్రారంభించాలన్నారు. పూడికతీత మట్టి పనులు జరుగుతున్న ప్రాంతంలో విద్యుత్తులైట్లను ఏర్పాటు చేయాలన్నారు. మట్టి తరలింపు వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. పూడికతీత మట్టి పనులు సజావుగా సాగేటట్టు అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమం లో హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, సాగునీటిపారుదల శాఖ ఈఈ శంకర్, డీఈ హర్షవర్ధన్ , కుడా పీవో అజిత్ రెడ్డి, ఈఈ భీం రావు, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రైతుల సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమం తప్పదు. ఏఐకేఎస్

**రైతు సంఘం మండల ప్రధాన కార్యదర్శిగా తాళ్లూరి ధర్మారావు**

**రైతు సంఘం మండల అధ్యక్షులుగా భూక్య మదన్ సింగ్,ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు**




**తొలి సమయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మార్చి 12**
సుజాతనగర్ మండలం ఈనెల 19 న పాల్వంచలోని జగన్నాధపురం లో జరిగే తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఏఐకేఎస్ జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం జిల్లా అధ్యక్షులు చంద్ర నరేంద్ర కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని రజబ్ అలీ భవన్లో రైతు సంఘం నాయకులు కార్యకర్తలు లతో సమావేశం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర రైతాంగ సమస్యలను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు పూర్తిగా రుణమాఫీ కాలేదని సాగునీరు పంట రుణాలను అందించడం లో ప్రభుత్వాలు విఫలమయ్యారు అన్నారు. అనంతరం సుజాతనగర్ రైతు సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు ఏఐకేఎస్ మండల,సహాయ కార్యదర్శిగా కాట్రవుల రాములు, ఉపాధ్యక్షులుగా కత్తి వెంకన్న ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కొర్ర లక్ష్మణ్, గడ్డం రామారావు, గౌరవ సలహాదారులు తాళ్లూరి పాపారావు, భాగం శాసన భూషణం, కుమారి హనుమంతరావు, కుల్సోత్ శంకర్, ఎన్నుకున్నారు. మండల కౌలురైతు సంఘం అధ్యక్షులుగా కత్తి వెంకన్న, భూక్య ప్రతాప్ సింగ్, రైతు సంఘం మండల కౌన్సిల్ సభ్యులుగా 20 మంది ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు వీసంశెట్టి పూర్ణచంద్రరావు, సిపిఐ మండల కార్యదర్శి భూక్య దస్రు, జిల్లా సమితి సభ్యులు జక్కుల రాములు, సిపిఐ నాయకులు భాగం శేషభూషణం, బొడ్డు కేశవరావు, వీర్ల దుర్గాప్రసాద్, ముక్కెర మురళి, మూడ్ గణేష్, తదితరులు పాల్గొన్నారు.

## సామాన్య ప్రజానీకాన్ని ఇబ్బందులకు గురి చేసే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలి..

**ఎస్పీ రోహిత్ రాజు**

**రోడ్డు ప్రమాదాల నియంత్రణ కొరకు నిత్యం వాహన తనిఖీలు చేపడుతూ వాహనదారులకు అవగాహన కల్పించాలి**

**జిల్లా పోలీసు అధికారులతో ఏర్పాటు చేసిన నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ రోహిత్ రాజు**



**తొలి సమయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మార్చి 12**
జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ జిల్లాలోని పోలీసు అధికారులతో నేర సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది.పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు గల కాన్ఫరెన్స్ హాలు నందు అధికారులతో సమావేశమయ్యారు.ముందుగా గత నెలలో వర్టికల్స్ వారీగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు మరియు సిబ్బందికి జిల్లా ఎస్పీ ప్రశంసా పత్రాలను అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో అధికంగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి అక్కడ నివారణా చర్యలను చేపట్టాలని సూచించారు.అనంతరం అన్ని పోలీస్ స్టేషన్లలో నమోదైన పెండింగ్లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి కేసులో సమగ్ర దర్యాప్తును చేపట్టి ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని తెలిపారు.పోక్సో కేసులలోని నిందితులకు త్వరతగతిన శిక్ష పడే విధంగా కృషిచేయాలని సూచించారు.గంజాయి అక్రమ రవాణా,మట్కా,క్రికెట్ బెట్టింగులు లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులు కలిగించే విధంగా ప్రవర్తించే వ్యక్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలని అన్నారు.అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రతి ప్రదేశంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా చేసి నేరాల నియంత్రణకు పాటుపడాలని అన్నారు.రాబోయే నెలలో జరగనున్న భద్రాచలం శ్రీరామనవమి ఉత్సవాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు బందోబస్త్ ప్రణాళికను రూపొందించాలని సూచించారు.పెట్రోలింగ్,బ్లూ కోల్ట్స్ వాహనాలతో నిత్యం రోడ్లపై సంచరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ఉండాలని సూచించారు.ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా నిత్యం వాహన తనిఖీలు చేపడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.షీ టీమ్స్,భరోసా కేంద్రాల ఆవశ్యకత గురించి అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేసి భాధిత మహిళలకు అండగా ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఐపిఎస్,ఇల్లందు డిఎస్పీ చంద్రభాను,కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్,మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి,పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్,డీసిఆర్బీ డిఎస్పీ మల్లయ్య స్వామీ,డీసిఆర్బీ సీఐ శ్రీనివాస్,సిసిఎస్ ఇన్స్పెక్టర్ రమాకాంత్,ఐటీ సెల్ సీఐ నాగరాజు రెడ్డి మరియు ఇతర అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## తేనెటీగల పెంపకం ఎంతో లాభదాయకం : డాక్టర్ సునీత

**నేషనల్ బి బోర్డ్ ఆర్థిక సహకారంతో శాస్త్రీయ తేనెటీగల పెంపకం పై రైతులతో జిల్లా స్థాయి సదస్సు**



**తొలిసమయం గూడూరు ప్రతినిధి ఏజాజ్ మార్చి 12**
తేనెటీగల పెంపకం ఎంతో లాభదాయకమని డాక్టర్ సునీత అన్నారు. బుధువారం నేషనల్ బి బోర్డ్ ఆర్థిక సహకారంతో శాస్త్రీయ తేనెటీగల పెంపకం పై గూడూరు మండలంలోని రైతు వేదికలో మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ మాలిక్ ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సదస్సు లో ముఖ్య అతిధులుగా డాక్టర్ సునీత,చీడల యాజమాన్య విభాగం హెడ్ మరియు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రజనీకాంత్, గూడూరు డివిజన్ అటవీ శాఖ అధికారి చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయనిర్మల ,ఏడిఏ అజ్మీరా శ్రీనివాస్ రావు పాల్గొని ఈ సందర్భంగా డాక్టర్ సునీత మాట్లాడుతూ తేనెటీగల పెంపకంతో రైతులకు అదనపు ఆదాయం చేకూరుతుందని అలాగే ఉద్యాన పంటలైన నువ్వులు, ఆవాలు, కుసుమ కంది, పొలాల్లో తినెటీగల పెట్టెలను అమర్చి లాభాలను పొందవచ్చని తెలిపారు సంవత్సరం పొడవునా వాతావరణ పరిస్థితులు ఎలా ఉన్నా వీటిని పెంచవచ్చు అని అన్నారు దాని ద్వారా వినియోగదారులకు తక్కువ ధరకు స్వచ్ఛమైన నాణ్యమైన తేనె దొరుకుతుందని తెలిపారు. ముఖ్యంగా తేనెటీగలు అంతరించిపోకుండా పరిరక్షించుకోవచ్చు అన్నారు. ప్రస్తుతం తేనె వినియోగం పెరిగిందని అన్నారు అందుకే రైతులు తేనెటీగల పెంపకాన్ని ఎంచుకోవాలని సూచించారు. ప్రభుత్వం కూడా తేనే ఉత్పత్తిని ప్రోత్సహిస్తుందన్నారు . ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ మాలిక్ , ఏఈవోలు వినయ్ , అలేఖ్య రెడ్డి రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడండి

**అటవీ శాఖ అధికారులను అదేశించిన హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**

**ఇనుపరాతి గుట్ట భూముల పై అధికారులతో కలెక్టర్ సమీక్ష**



**తొలిసమయం హనుమకొండ మార్చి 12**
పట్టా పాస్ పుస్తకాలు కలిగిన రైతులకు చెందిన 45 ఎకరాల వ్యవసాయ భూమిని వారి ఆధీనంలోనే ఉండే విధంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అటవీ శాఖ అధికారులను ఆదేశించారు.బుధవారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని ముప్పారం,దేవునూరు గ్రామాల్లో విస్తరించి ఉన్న ఇనుపరాతి గుట్ట పరిధిలో ఫారెస్ట్ అధికారులు గుర్తించిన వ్యవసాయ పట్టాభూముల పై జిల్లా కలెక్టర్ ప్రావీణ్య వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, ఆర్డీవో రాథోడ్ రమేష్, ల్యాండ్ సర్వే విభాగం ఏడి శ్రీనివాసులు, ధర్మసాగర్ తహసీల్దార్ గుత్తికొండ సదానందం, అటవీ శాఖ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయ భూముల సర్వే, సంబంధిత రైతుల గుర్తింపు, తదితర వివరాలను సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ పలు గ్రామాలకు చెందిన రైతులకు పట్టాపాస్ పుస్తకాలు ఉండి డ్రాఫ్ట్ నోటిఫికేషన్ లో లేని వారి భూములను కూడా అటవీ శాఖ తమ ఆధీనంలోకి తీసుకోగా వాటిని తిరిగి గుర్తించి ఆ పట్టా భూములను రైతులకు స్వాధీన పరచాలన్నారు. ఈ సమావేశంలో కుడా పీవో అజిత్ రెడ్డి, వేలేరు తహసీల్దార్ కోమి, అటవీ, సర్వే, ఇతర అధికారులు పాల్గొన్నారు.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST:MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101